# మంగలార్తి

గా దినం విక్రమార్కుడు యాల్ల పొద్దుగాల్లే నిద్రలేసిండు. మొకం గడుక్కుండు. మొకం గడుక్కోని పేపర్ సద్వుకుంట గూసున్నడు. గాయిన పెండ్లాం ఒక కోపుల చాయ్ దీస్కోని వొచ్చింది. పెండ్లాం దెచ్చిన చాయ్‌ని గాయిన దాగిండు. పేపర్ సద్వుడైనంక తానం జేసిండు.

అంబట్యాల్ల గాంగనే గాయిన పెండ్లాం –

"కుదిచ్చుకుందువురా!" అని బిల్సింది.

గామె బిల్వంగనే విక్రమార్కుడు డైనింగ్ టేబుల్ కాడ్కి బోయిండు. కుర్సీల గూసున్నడు. గాయిన పెండ్లాం బువ్వ బెట్టింది. విక్రమార్కుడు తిన్నంక మంచిగ బన్నడు. పొద్దుమీకినంక నిద్రలేసిండు. కాల్లు, చేతులు గడుక్కుండు. జల్దిజల్ది గింత దిన్నడు. తిన్నంక మోటర్ దీస్కోని బొందల గడ్డ కాడ ఉన్న బేతాలుని బంగ్ల కాడ్కి బోబట్టిండు. పిట్రోల్ ఒడ్సిపోయె బట్కె నడ్మీట్ల మోటర్ ఆగింది. దగ్గర్లనే పిట్రోల్ పంపు ఉన్నది. గాల్లను గీల్లను బత్మిలాడి పిట్రోల్ పంపు దాంక విక్రమార్కుడు మోటర్‌ను నూక్కుంట బోయిండు. మోటర్ల పిట్రోలు బోపిచ్చుకున్నడు. పిట్రోల్ బోపిచ్చుకున్నంక మోటర్‌ను నడ్పుకుంట బొందల గడ్డ దిక్కు బోబట్టిండు.

సరింగ పదకొండు గొట్టంగ విక్రమార్కుడు, బేతాలుని బంగ్ల ముంగట మోటర్ ఆపిండు. ఆపి హారన్ గొట్టిండు. హారన్ సప్పుడు ఇనంగనే బేతాలుడు బంగ్ల కెల్లి ఇవుతలికి వొచ్చిండు. మోటర్ ఎన్క తల్పు దీసిండు. దీసినంక ఎన్క సీట్ల గూసున్నడు. బేతాలుడు మోటర్ తల్పు దెర్సి గూసోంగనే విక్రమార్కుడుమోటర్ నడిపియ్య బట్టిండు. గప్పుడు ఎన్క సీట్ల గూసున్న బేతాలుడు–

"నన్ను ఎన్కసీట్ల గూసుండబెట్టుకోని మోటర్ నడిపిస్తుంటె నీ చేతులు గుంజొచ్చు. ఊకె తొవ్వ దిక్కు సూసె బట్కె నీ కండ్లు గుంజొచ్చు. గవన్ని యాదిమర్సె తందుకు నీకొక కత జెప్త ఇను.

రాయిగిరిల యాద్గిరి అనేటాయిన ఉన్నడు. గాయినకు ఒక పాన్ డబ్బ ఉన్నది. పాన్ గట్టిచ్చుకునేందుకు, సిగిలేట్లు ముట్టిచ్చుకునేందుకు చోటా లీడర్లు గాయిన పాన్ డబ్బ కాడ్కి వొచ్చెటోల్లు. పాన్ దినుకుంట, సిగిలేటు దాక్కుంట రాజకీయాల గురించి ముచ్చట బెట్టెటోల్లు. తినంగ తినంగ యాపాకు తియ్యగైన తీర్గ ఇనంగ ఇనంగ యాద్గిరికి రాజకీయాల మీద మనసుబుట్టింది. మనసుబుట్టంగనే గాయిన పాన్ డబ్బల తమ్మున్ని కూసుండబెట్టిండు. కూసుండబెట్టి చోటా లీడర్ల యెంబడి దిర్గ బట్టిండు. చోటా లీడర్ల యెంబడి తిర్గితిర్గి గాయిన గూడ చోట లీడర్ అయ్యిండు. చోటా లీడర్ అయినంక గాయిన పైరవీలు జేసిండు. మస్తు రూపాలు కమాయించిండు. పట్నంల ఒక హోటల్ గూడ బెట్టిండు. పెండ్లాం పేరు మీద నాలుగంత్రాల బంగ్ల గట్టిపిచ్చిండు.

ఎట్లన్న జెసి ఎమ్మెల్యె గావాలని యాద్గిరి అనుకున్నడు. అనుకోని గాయిన పార్టి ప్రెసిడెంట్ తాన్కి బోయిండు. ముందుగాల్ల గాయిన కాల్లు మొక్కిండు. యాద్గిరి కాల్లు మొక్కంగనే పార్టి ప్రెసిడెంట్ కుషయ్యిండు.

"ఏంది పని మీద వొచ్చినవు?" అని అడిగిండు.

## తెలిదేవర భానుమూర్తి

"మిమ్ములను సూసెతందుకు వొచ్చిన" అని యాద్గిరి అన్నడు.

"నిజం జెప్పు. నేనేమనుకోను" అని పార్టి ప్రెసిడెంట్ అంటె–




"నిజంగనే మిమ్ములను జూసెతందుకు వొచ్చిన" అని యాద్గిరి అన్నడు.

గాయిన గట్ల జెప్పంగనే గీయిన ఎంత మంచోడు అని పార్టి ప్రెసిడెంట్ మనసుల అనుకున్నడు.

వారం దినాలకు ఒక్క పారి యాద్గిరి పార్టి ప్రెసిడెంట్ తాన్కి బోబట్టిండు. గాయినకు మస్క గొట్ట బట్టిండు. గాయిన ఏదన్న పని జెప్తె జెయ్యబట్టిండు. గిట్లుండంగ అసెంబ్లి ఎలచ్చన్లు వొచ్చినయి. ఎప్పటి లెక్కనే యాద్గిరి పార్టి ప్రెసిడెంట్ తాన్కి బోయిండు. గాయిన కాల్లను పాలతోని గడిగిండు. కడిగినంక గందం బూసిండు. పూలతోని పూజ జేసిండు.

## ఎన్నిక(థ)లు

చెంచ పాలను తీర్థం తీర్గ తాగిండు. పార్టి ప్రెసిడెంటు కాల్లకు మంగలార్తి ఇచ్చిండు. మంగలార్తి ఇచ్చినంక కొబ్బరికాయ గూడ గొట్టిండు. ఇగ దాంతోని పార్టి ప్రెసిడెంట్ కుషయ్యిండు.

"నీ కేంగావాలె జెప్పు" అని అడిగిండు.

"నా కేమొద్దు" అని యాద్గిరి అన్నడు.

[illegible] గది ఇస్త" అని పార్టి ప్రెసిండెట్ అన్నడు.

"నిజంగ ఇస్తరా?" అని యాద్గిరి అన్నడు.

"నిజంగనే ఇస్త" అని పార్టి ప్రెసిడెంట్ అన్నడు.

"గట్లయితె నాకీ పారి ఎమ్మెల్లె టికిట్ ఇయ్యుండ్రి" అని యాద్గిరి అన్నడు.

"నీగ్గిన ఎమ్మెల్లె టికిట్ ఇస్తె పాతోల్లు గుల్గుతరు. పార్టిని ఇడ్సిపెట్టి వేరె పార్టిలకు దుంకుతరు" అని పార్టి ప్రెసిడెంట్ అన్నడు.

"నేను ఏది అడ్గితె గది ఇస్తనని మీరే అన్నరు. గిప్పుడేమొ పాతోల్లు గుల్గుతరని అంటున్నరు" అని యాద్గిరి అన్నడు.

"ఎలచ్చన్ల నిలబడుడంటె మాటలు గాదు. మీటింగ్లు బెట్టాలె. మోటర్లల్ల ఊరూరు దిర్గాలె. పోస్టర్లు చపాయించాలె. గుడికి బోయి పూజ జెయ్యాలె. మసీదుకు బోయి నమాజ్ సద్వాలె. గుడిసెలల్లకు బోయి గంజి గట్క దాగాలె. ఎవలన్న తిడ్తె ఊకోవాలె. గియన్ని నీతోని అయితయా?" అని పార్టి ప్రెసిడెంట్ అడిగిండు.

"ఎందుగ్గావు?" అని యాద్గిరి అన్నడు.

"నీ తోని అయితయంటవు. గట్లయితె పాతోల్లు ఏమనుకున్నా నీకు ఎమ్మెల్లె టికిట్ ఇస్త. నువ్వు నాకు శాన దగ్గరోనివి" అని పార్టి ప్రెసిడెంట్ అన్నడు.

అన్న తీర్గనే పార్టి ప్రెసిడెంట్ యాద్గిరికి ఎమ్మెల్లె టికిట్ ఇచ్చిండు. గని పార్టి ప్రెసిడెంటు చెప్పిన తీర్గ యాద్గిరి ఊరూరు దిర్గలేదు. గుడికి బోయి పూజలు జెయ్యలేదు. మసీదుకు బోయి నమాజ్ సద్వలేదు. ఒక్క మీటింగ్ గూడ బెట్టలేదు. ఒక్క స్పీచ్ గూడ గొట్టలేదు. గని యాద్గిరి ఎలచ్చన్ల గెల్సిండు. ఇంతకు యాద్గిరి ఎలచ్చన్ల ఎట్ల గెల్సిండు. గీ సవాల్‌కు జవాబు ఎర్కుండి గూడ జెప్పకుంటివా అంటె నీ మోటర్ బిరక్ పేలైతది" అని బేతాలుడు అన్నడు.

"యాద్గిరి మీటింగ్లు బెట్టలేదు. స్పీచ్ గొట్టలేదు. గని ఇంటింటికి బోయి ప్రచారం జేసిండు. ఎవ్వలన్న ఇంటికి బోయే ముంగట గాల్ల ఇంట్ల ఎన్ని ఓట్లు ఉన్నయో ఎర్క జేసుకునేటోడు. గా ఇంటి ఆడోల్లను మంగలార్తి ఇయ్యుమనెటోడు. ఆడోల్లు మంగలార్తి ఇయ్యంగనే మంగలార్తి తప్కుల గాల్ల ఇంట్ల ఎన్ని ఓట్లు ఉన్నయో గన్ని నూర్ల రూపాలు ఏసెటోడు. మంగలార్తి తప్కుల రూపాలు ఏస్తె ఎవ్వలు తప్పుబట్టరు. గిట్ల ఓట్లను గొని యాద్గిరి ఎలచ్చన్ల గెల్సిండు" అని విక్రమార్కుడు జెప్పిండు.

విక్రమార్కుడు జవాబు జెప్పంగనే బేతాలుడు మోటర్ రుకాయించుమన్నడు. విక్రమార్కుడు మోటర్ రుకాయించంగనే బేతాలుడు మోటర్ దిగిండు. ఒక ఆటో దీస్కోని బొందల గడ్డ దిక్కు ఉర్కిండు.